

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మురికివాడల రూపురేఖలు మారుస్తాం

- ప్రజారోగ్యానికి పెద్దపీట
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వెంగళరావునగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో మురికివాడల రూపురేఖలు మారుస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూసుఫ్‌గూడ శ్రీ సాయిరాం గార్డెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మురికివాడల్లో మౌలిక సదుపాయాలు కల్పనలో నిర్లక్ష్యం చేసిందన్నారు. తమ అపార్ట్‌మెంట్ పక్కనున్న డంపింగ్ యార్డ్ వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, కల్లు కాంపౌండ్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు, పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటుపై తదితర వాటి గురించి అపార్ట్‌మెంట్ వాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించాలని కోరారు. స్థానికుల సమస్యలు పరిష్కారిస్తామని ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే జూబ్లీహిల్స్‌కు మహర్దశ పట్టనుందని, ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తామని వారికి హామీ ఇచ్చారు. సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు రాయల నాగేశ్వరరావు, అన్వేష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, దేవిరెడ్డి నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ చేస్తూ... ఓటర్‌ను పలకరిస్తూ..

కృష్ణకాంత్ పార్క్‌లో ప్రచారం చేసిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

యూసుఫ్ గూడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది మంది వాకర్‌లు, యోగ సాధకులు, సందర్శకులతో రద్దీగా ఉండే పార్కును ఎన్నికల ప్రచార కేంద్రంగా మార్చారు. ఆదివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులతో కలిసి వారు కృష్ణకాంత్ పార్క్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రాంతానికి వచ్చే వారంతా జూబ్లీహిల్స్ ఓటర్‌లు కాగా.. వాకింగ్ చేస్తూ తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయండని వేర్వేరుగా అభ్యర్థించారు.



కృష్ణకాంత్ పార్క్‌లో వాకింగ్ చేస్తూ ప్రచారం చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, అభ్యర్థి దీపక్ రెడ్డి

ఓపెన్ జిమ్‌ను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కృష్ణకాంత్ పార్క్‌లోని ఓపెన్ జిమ్‌ను బీజేపీ అభ్యర్థి లంకల దీపిక్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సందర్శించారు. జిమ్ పరికరాలు శిథిలమయ్యాయని, ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీంతో పాటు మరో చోట జిమ్‌ను ఏర్పాటు చేయాలని, కనీస సౌకర్యాలు లేవని, అభివృద్ధి జాడే లేదని వాకర్ రవి తెలిపారు. ప్రస్తుతం ఉన్న జిమ్ తన ఎంపీ నిధులతోనే ఏర్పాటు చేశామన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించండి : వినోద్ కుమార్

బీఆర్ఎస్ అభ్యర్థి సునీతను గెలిపించాలని మాజీ ప్రణాళికా సంఘం అధ్యక్షుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్ ఓటర్లను కోరారు. ఆదివారం పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన కృష్ణకాంత్ పార్కులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్‌దేనని అన్నారు.

రాష్ట్రంపై కేంద్రం చిన్న చూపు : మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్రం నుంచి పన్నులు తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపై చిన్న చూపు చూస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ప్రజల నుంచి పన్నులు వసూల్ చేసి కేంద్రానికి ఇస్తుంటే రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేటాయించడం లేదన్నారు. కృష్ణకాంత్ పార్కులో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారెంటీలతో పాటు పలు సంక్షేమ పథకాలు పేదలకు అందాలంటే జూబ్లీ ఉప పోరులో కాంగ్రెస్‌కు ఓటు వేయమన్న ముఖ్యమంత్రి మాటలను కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధి కోసం వక్రీకరిస్తున్నారని తెలిపారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేయని పార్టీలను ఓడగొట్టాలి

- జస్టిస్ చంద్రకుమార్

పంజాగుట్ట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలకు మేలు చేయని పార్టీలను ఓడగొట్టాలని తెలంగాణ ప్రజల పార్టీ అధ్యక్షుడు, జస్టిస్ చంద్రకుమార్ పిలుపునిచ్చారు. జాగో నవ తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలకు ఎలాంటి మేలు చేయకుండా వారిని ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీని, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కాంగ్రెస్‌ను, అవినీతిలో కూరుకుపోయిన గత ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఎండీ అబ్దుల్ హక్, ప్రధాన కార్యదర్శి పి.మల్లేష్, కోల జనార్దన్, కార్యదర్శి లింగ్యానాయక్, పవన కళ్యాణ్, సాయి కృష్ణప్రభానంద్, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య వ్యాప్తికి 'తెలుగు వెలుగు'

ఖైరతాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సాహిత్యాలను వ్యాప్తి చేయాలనే ఉద్దేశంతో తెలుగు వెలుగు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని యువభారతి వ్యవస్థాపక సమావేశ కర్త, ఐఐఎంసీ కళాశాల చైర్మన్ ఆచార్య వంగపల్లి విశ్వనాథం పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 38 సంస్థలు తెలుగు వెలుగు కార్యక్రమాలను నిర్వహించేందుకు ముందుకొచ్చాయని తెలిపారు. కమలాకర లలిత కళా భారతి సంస్థ, యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ఐఐఎంసీ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం లక్డీకాపూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాల ప్రత్యేక సమావేశ కర్తలుగా సాధన నరసింహాచార్య, కె.వి.ఎన్. ఆచార్యలను నియమిస్తూ వారిని సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి ఆచార్య ఫణీంద్ర రచించిన 'భారత భారతి' డా.కె.వి.కృష్ణకుమారి రచించిన భద్రా కల్యాణం గ్రంథాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూర రఘువీర్, ఆచార్య వి.విశ్వనాథం, యువభారతి కార్యదర్శి జీడిగుంట వెంకట్రావు సభ్యులు అమాతి రవీంద్ర, నారాయణ రెడ్డి, వాసవి ఫౌండేషన్ సహ చైర్మన్ చంద్రయ్య, ఐఐఎంసీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు ఇ.రామకృష్ణ, యువభారతి యూట్యూబ్ ఛానల్ ప్రసార కర్త శ్యాం సుందర్, ఇతర యువభారతి సభ్యులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.



మెడికల్ సీటు సాధించిన దళిత విద్యార్థిని ఎం.శృతిని సన్మానిస్తున్న నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి

విద్యార్థినికి సన్మానం

బోరబండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన దళిత విద్యార్థిని ఎం.శృతిని నాగర్ కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి ఆదివారం సన్మానించారు. బలహీన వర్గాల కాలనీ అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాలమూరు జిల్లాకు చెందిన విద్యార్థిని మెడికల్ సీటు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు చేరాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. అంబేడ్కర్ యువజన సంఘం బోరబండ శాఖ అధ్యక్షుడు ఎ.డి.మధు ఆమెకు జ్ఞాపికను అందజేశారు.



మాట్లాడుతున్న ఐ.ఎల్.డబ్ల్యూ.ఎఫ్ అధ్యక్షుడు అలీ బాక్రీ

ఇష్టారీతిన ఇతర ప్రాంతాల ఆటోలు

- వాటిపై చర్యలు తీసుకోవాలి
- లేకుంటే డిసెంబరులో ఆందోళన : ఐఎల్‌డబ్ల్యూఎఫ్

పంజాగుట్ట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆటోలు ఇష్టం వచ్చినట్లుగా తిరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఇన్ఫార్మల్ లేబరర్స్, వర్కర్స్ ఫెడరేషన్(ఐ.ఎల్.డబ్ల్యూ.ఎఫ్) జాతీయ అధ్యక్షుడు ఇనాయత్ అలీ బాక్రి ఆరోపించారు. అక్రమంగా తిరుగుతున్న ఆటోలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో డిసెంబరు నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా ఆటోలను అడ్డుకుని వాటికి తాళం వేస్తామని హెచ్చరించారు. ఐ.ఎల్.డబ్ల్యూ.ఎఫ్ ఆటో డ్రైవర్స్ బంధు అసోసియేషన్ సమావేశం ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు. వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం ఆటో యూనియన్ నాయకులు అమానుల్లా ఖాన్, కె.సత్యనారాయణలతో కలిసి ఆయన మాట్లాడుతూ నగరంలో అధికారికంగా పర్మిట్ తీసుకుని రూ. 2 లక్షల వరకు ఆటోలు నడుస్తుండగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మరో మూడు లక్షల వరకు ఆటోలు నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా నడుస్తున్నాయన్నారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ మహా పాదయాత్ర

బంజారాహిల్స్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో బీజేపీ కొత్త తరహా ప్రచారానికి శ్రీకారం చుట్టింది. రెండు రోజుల క్రితం 58 శక్తి కేంద్రాల్లో ప్రచారం నిర్వహించిన పార్టీ అగ్రనేతలు ఆదివారం నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మహాపాదయాత్ర నిర్వహించారు. రహ్మత్‌నగర్ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఇంటింటికి వెళ్లి పార్టీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లోనే పాదయాత్ర చేయాల్సి వస్తోందన్నారు. షేక్‌పేట డివిజన్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బోరబండ వినాయకరావునగర్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఎంపీ రఘునందన్‌రావు, ఎల్లారెడ్డిగూడలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి, యూసుఫ్‌గూడలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాదయాత్ర నిర్వహించారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

పార్టీ మరింత బలోపేతం

ఎర్రగడ్డ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీలోకి అధిక శాతం యువకులు చేరుతుండడంతో పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మరింత బలపడుతుందని అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డి అన్నారు బీజేవైఎం నాయకులు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎర్రగడ్డ రాయల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఛత్రపతి శివాజీ నగర్, ఆనంద్ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు యువకులు లంకల దీపక్ రెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరారు. వారికి కండువాలను కప్పి ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బాల ప్రకాష్, ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షులు బొట్టు విజయకుమార్, నాయకులు గణేష్ కుమార్, సూర సునీత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

- ప్రధాని మోదీ దేశంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉపఎన్నికలో బీజేపీని గెలిపిస్తుందని పార్టీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ఇంటింటికి తిరిగి ఓటర్లకు కరపత్రాలను పంచిపెట్టారు. హేమవతి నగర్‌లో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ లో ఎమ్మెల్యే రామారావు పటేల్, రాజీవ్ నగర్ లో మాజీ ఎంపీ వెంకటేష్ నేత, సుల్తాన్ నగర్ లో బీజేపీ ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌చార్జి మేకల సారంగపాణిలు పాదయాత్రలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు బొట్టు విజయకుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఈ. అశోక్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గణేష్ కుమార్, సూర్య సునీత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి

ముఖ్యమంత్రి వ్యాఖ్యలు బాధాకరం

- జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగరాలి
- బీఆర్ఎస్ నేతలు

వెంగళరావునగర్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): సీఎం వ్యాఖ్యలు బాధాకరం అని బీఆర్ఎస్ నేతలు అన్నారు. ఆదివారం వెంగళరావునగర్ డివిజన్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, జెడ్పీ మాజీ ఛైర్ పర్సన్ తుల ఉమా, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా, స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్, నాయకులతో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తమ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని వారు అన్నారు. మధురానగర్ పార్క్‌లో వాకింగ్ చేస్తున్న వారిని అభ్యర్థించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాలుగు లక్షల ఓటర్ల తీర్పు నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల భవిష్యత్ నిలబెడుతుంది అని మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌లు అన్నారు. అమీర్‌పేట విజయ టవర్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు మహిళల ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించారు. మహిళలకు అవకాశం వస్తే అద్భుతాలు సృష్టిస్తారని చరిత్ర చెబుతుందని, అటువంటి వారిని కించపరుస్తూ సీఎం.. సునీతను ఉద్దేశించి మాట్లాడడం బాధాకరం అని అన్నారు. సోనియా, ప్రియాంకగాంధీ నాయకత్వంలో పనిచేస్తున్న రేవంత్ రెడ్డి మాగంటి సునీత పాలనకు ఎందుకు అర్హులు కారో ప్రజలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. పలువురు మహిళలు, యువత వారి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, విజయ టవర్స్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు అపార్ట్మెంట్ వాసులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిగూడలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్లు శేఖర్,దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, మాదేవ్ పూర్ రవీందర్ రెడ్డి, శేఖర్‌పంతులు ఆయన వెంట ఉన్నారు. షేక్‌పేట్ డివిజన్‌లో దివ్యాంగులతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ముచ్చటించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని వారికి వివరిస్తూ సునీతను గెలిపించాలని కోరారు.





మధురానగర్ ప్రచారంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, అనూషరామ్, వెంగళరావునగర్ డివిజన్.. ప్రచారంలో ఎమ్మెల్యే సంజయ్, బీఆర్ఎస్ అభ్యర్థి సునీత

క్రైస్తవులు బీఆర్ఎస్‌ను ఆదరించాలి

బోరబండ, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ క్రైస్తవులను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎస్పీఆర్ హిల్స్‌లోని పలు చర్చిలలో ఆదివారం జరిగిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. యేటా క్రిస్మస్ వేడుకల్లో సందర్భంగా ప్రతీ సంవత్సరం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ దుస్తులు, కానుకలు అందజేసేవారని గుర్తుచేశారు. స్థానిక క్రీడాప్రాంగణంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేవారని తెలిపారు. ఉపఎన్నికల్లో పోటీ చేస్తున్న గోపీనాథ్ సతీమణి సునీతను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్, రాజీవ్ సాగర్, సయ్యద్ మసూద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

ఆటో డ్రైవర్ నిజాయితీ

- రూ.1.02 లక్షల నగదు బ్యాగ్ బాధితులకు అప్పగింత

చాదర్‌ఘాట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటాడు. ఆటోలో ప్రయాణికుడు మరచిపోయిన బ్యాగ్‌ను మలకపేట పోలీసుల సాయంతో బాధితులకు అప్పగించాడు. మలక్‌పేట ఎస్ఐ తేజానాయక్ వివరాల ప్రకారం.. నాందేడ్ నివాసులైన అంజలి, వినోద్ పాపిన్‌వార్ దంపతులు. కూతురు వివాహానికి వస్త్రాలను కొనేందుకు ఈనెల 1న నగరానికి వచ్చారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ దుకాణంలో వస్త్రాలను కొన్న తర్వాత బంజారాహిల్స్‌కు ఆటోలో వెళ్లారు. ఈ ప్రాంతంలో బ్యాగ్ మర్చిపోయి దిగిపోయారు. విషయమై బంజారాహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఎక్కడ ఆటో ఎక్కారో ఆ పరిధి పీఎస్‌లోనే ఫిర్యాదు చేయాలంటూ పోలీసులు సూచించారు. కాగా, నాగోల్ ప్రాంత నివాసి అయిన ఆటో డ్రైవర్ నర్సింహ మరుసటి రోజైన ఆదివారం బ్యాగ్‌ను గుర్తించాడు. అనంతరం మలక్‌పేట పీఎస్‌కు వచ్చి ఆ బ్యాగ్‌ను పోలీసులకు అప్పగించాడు. అందులో రూ.1.02లక్షలు ఉన్నట్లుగా మలక్‌పేట ఎస్ఐ తేజా నాయక్ తెలిపారు. వస్త్ర దుకాణంలో బిల్లు ఆధారంగా ఈ షాపు నుంచి మొబైల్ నంబర్‌ను తీసుకొని కాల్ చేయగా వారు మలక్‌పేట పీఎస్‌కు చేరుకున్నారు. ఆటో డ్రైవర్ నిజాయితీని పోలీసులతో పాటు నాందేడ్ నివాసులైన అంజలి, వినోద్‌కుమార్ దంపతులు ప్రశంసించారు. ఆటో డ్రైవర్‌కు రూ. వెయ్యి పారితోషికం అందజేశారు.



బాధితులకు ఆటోడ్రైవర్‌తో కలిసి నగదు బ్యాగ్‌ను అందజేస్తున్న ఎస్ఐ

సీపీఐ ప్రచారం

వెంగళరావునగర్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్‌ను గెలిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి నరసింహ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిగూడలో పార్టీ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్ బోస్ ,హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, నాయకులు కె.శ్రీనివాస్, ఎన్.శ్రీకాంత్, బాలకృష్ణ, నరసింహ, లెనిన్, నాగేష్, యాదిలాల్, భీముడు, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీమ్రిస్ చైర్మన్ ఫహీం ఖురేషి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

బోరబండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో అధికార పార్టీ అభ్యర్థి గెలిస్తే అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని కాంగ్రెస్, మజ్లిస్ నాయకులు తెలిపారు. బోరబండ సైట్-3 ఆచార్య జయశంకర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వివిధ సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. బోరబండ పరిసర ప్రాంతాల ప్రజల కోరిక మేరకు మైనారిటీ బాలికల గురుకుల కళాశాలను ఎర్రగడ్డలో ఏర్పాటు చేశామన్నారు. బోరబండ ప్రాంత ముస్లింల కోసం ఖబ్రస్తాన్ స్థలాన్ని కచ్చితంగా సాధిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే పనులు మరింత వేగంగా జరుగుతాయని చెప్పారు. మజ్లిస్ ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీమ్రిస్) చైర్మన్ ఫహీం ఖురేషి, మజ్లిస్ యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు యాసర్ అరాఫత్, ఎంఐఎం జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి అన్వర్ సాదత్, షేక్ అహ్మద్, నసీరుద్దీన్, మహమ్మద్, కాంగ్రెస్ నాయకులు షేక్ షరీఫ్, ప్రముఖ న్యాయవాది అఫ్జలుద్దీన్ దక్కనీ, ఎన్ఆర్ఆర్ పురం గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడు యూసుఫుద్దీన్, కార్యదర్శి షెరీ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ ఆలయ ధర్మకర్తలతో కోట నీలిమ

హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

- నూతన ధర్మకర్తలతో పీసీసీ వైస్ ప్రెసిడెంట్ కోట నీలిమ

అమీర్‌పేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించి ప్రసిద్ధి గాంచిన హనుమాన్ ఆలయం అభివృద్ధికి కృషి చేయాలని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం..ఆమెను అమీర్‌పేట హనుమాన్ ఆలయానికి నూతనంగా ఎన్నికైన ధర్మకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. నీలిమ.. కమిటీ సభ్యులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు ఎస్.ఎస్ రావు, మహిళా విభాగం అధ్యక్షుడు రాజేశ్వరి, అశ్విని, నాయకులు శ్రీకాంత్, పద్మావతి, ఛైర్మన్ గుడిగే సత్యనారాయణ యాదవ్, అశోక్ చారి, మనీష్ జైన్, శ్రీనివాస రావు, అనిత, శోభ, దేవి, హరిశంకర్ గౌడ్, మాజీ సభ్యులు కటకం భాస్కర్ గుప్తా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీతకే సైన్స్ ఫెయిర్లు

అమీర్‌పేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రాథమికదశలోనే విద్యార్థుల్లో నెలకొన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు విద్యా, వైజ్ఞానిక (సైన్స్‌ఫెయిర్)లు ఎంతో ఉపయోగపడుతాయని ఎస్ఆర్‌నగర్ బచ్‌పన్ పాఠశాల డైరక్టర్ మురళీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో స్థానిక పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. రోబోటిక్స్, కంప్యూటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైన్స్ ఎక్స్‌పర్‌మెంట్స్ రోడ్డు ప్రమాదాల నివారణ, సేంద్రియ వ్యవసాయం, తక్కువ నీటితోనే ఇంట్లోనే కూరగాయల సాగు, సోలార్ విద్యుత్, కాలుష్య కారకాలను తగ్గించడం ఎలా తదితర వాటిని ప్రదర్శించి చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఇందులత రెడ్డి, ప్రిన్సిపాల్ నీరజ కక్కర్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైన్స్ ఫెయిర్‌లో డైరెక్టర్ మురళీధర్ రెడ్డి

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

పంజాగుట్ట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ప్రేమ్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రీసర్చ్ ఆధ్వర్యంలో జై జవాన్ జై కిసాన్ యువజన సంక్షేమ సంఘం, డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారిని మందులను అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ నితిన్ సింగ్, ప్రేమ్‌నగర్ బస్తీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కే. భగవాన్ దాస్, మామిడి నర్సింగ్‌రావు, అపోలో ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వేంకటేశ్వర వేదాంతవర్థిని సంస్కృత కళాశాలలో పూజలు చేస్తున్న జంపన ప్రతాప్

ఘనంగా కార్తీకమాస పూజలు

బోయినపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం క్షీరబ్ది ద్వాదశిని పురస్కరించుకుని ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్‌లో గల తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర వేదాంతవర్థిని సంస్కృత కళాశాలలో ఆదివారం గణపతి పూజ, రుద్రాభిషేకం, సుదర్శన హోమం, తులసీ దామోదర కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసేన అధ్యక్షుడు టీటీడీ హిమాయత్‌నగర్ అధ్యక్షుడు శంకర్ గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ బోనోతు సురేందర్, పవన్, సిబ్బంది పాల్గొన్నారు.


రైల్వే ఐజీ అరుల్ జ్యోతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఆర్పీఎఫ్ బాంబ్ డిస్పోజబుల్ డిటెక్టివ్ స్క్వాడ్ బృందం

రన్నర్ అప్‌గా రైల్వే ఆర్పీఎఫ్ టీం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో అక్టోబరు 30న, నవంబరు 1న రెండు రోజుల పాటు చెన్నైలో నిర్వహించిన ఆల్ ఇండియా ఆర్పీఎఫ్ యాంటీ సబోటేజ్ చెక్స్ కాంపిటీషన్(బాంబు డిస్పోజబుల్ డిటెక్టివ్ స్క్వాడ్) జరిగిన పోటీలో ఆర్పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కరుణ మూర్తి వ్యక్తిగత యాక్సెస్ కంట్రోల్ కేటగిరీలో మూడో స్థానం దక్కించుకున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే టీం వరుసగా రెండవ ఏడాది కూడా రన్నర్‌ఆఫ్‌గా నిలిచాడు. ఈ పోటీలో గెలిచిన విజేతలకు చెన్నైలో రైల్వే ఐజీ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్) అరుల్ జ్యోతి మెమొంటోలను అందుకున్నారు. మెమొంటో అందుకున్న ఆర్పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, రవి, గోవిందరాజులు, కానిస్టేబుల్ ఎస్కే సరోజ్‌లు ఉన్నారు.


మధుగౌడ్ ఆధ్వర్యంలో టీఆర్‌పీ పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు

టీఆర్‌పీలో చేరిన వివిధ పార్టీల నాయకులు

అడ్డగుట్ట నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టీఆర్‌పీ)ని సికింద్రాబాద్ నియోజకవర్గంలో పటిష్టం చేసేందుకు సైనికుల్లా పనిచేస్తామని ఆ పార్టీలో చేరిన అడ్డగుట్టకు చెందిన మధుగౌడ్ తెలిపారు. ఆదివారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అభిమానులు టీఆర్‌పీలో చేరామన్నారు. ఇక నుంచి పార్టీలో చేరిన తమని తీన్మార్ మల్లన కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారని అన్నారు. పార్టీలో చేరిన నాయకులు శ్రీనివాస్, మురళి, కిట్టు, సాయి కిరణ్, మధు, శ్రీనివాస్, వినోద్, కీర్తి, పి. శివకుమార్‌లు ఉన్నారు.

నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ

పద్మారావునగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్‌లోని స్కై ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వై.సంజీవ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న నిరాశ్రయులు, సంచార జాతుల వారికి దుస్తులను అందజేశారు.


రోడ్డు పక్కన నిరాశ్రయులకు దుస్తులు అందజేస్తున్న సంజీవకుమార్

బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

తార్నాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : షాపుల ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఆదివారం నాచారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నాచారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్‌కు చెందిన కేశవర్ శంకర్ సింగ్ అక్టోబర్ 29న మధ్యాహ్నం సమయంలో తన పల్సర్ బైక్‌ను మల్లాపూర్‌లోని వైన్ పార్క్ వైన్ షాపు ముందు పార్క్ చేసి లోపలికి వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత బయటకు వచ్చి చూసేసరికి తన బైక్ కనిపించలేదు. దాంతో చుట్టు పక్కల ఎంత వెతికినా దొరకకపోవడంతో కంగారు పడ్డ వాహనదారుడు వెంటనే నాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం కుందనపల్లి గ్రామం టోల్‌గేట్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు సూరా సాయి ప్రసాద్(28) ను పోలీసులు గుర్తించారు. అనంతరం అతనిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడు గతంలో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 1, బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 4 బైక్ దొంతనాలకు సంబంధించి కేసులు నమోదయినట్లు పోలీసులు తెలిపారు.


సైగా కాలనీలోని రోడ్డు


పికెట్ కేవీ స్కూల్ వద్ద రోడ్డు


మడ్‌ఫోర్ట్‌లోని కంటోన్మెంట్ వర్క్‌షాప్ రోడ్డు

ట్రాఫిక్ మళ్లింపుతో తిప్పలు..
అధ్వాన రోడ్లతో అవస్థలు


డైమండ్ పాయింట్ వద్ద రోడ్డు

కంటోన్మెంట్ రహదారుల్లో ప్రయాణం నరకం

సికింద్రాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం వల్ల ట్రాఫిక్ మళ్లింపుతో నానా అవస్థలు పడుతున్న ప్రజలకు.. కంటోన్మెంట్‌లోని గుంతలమయమైన ప్రధాన, అంతర్గత రహదారులు మరిన్ని అవస్థలు తెచ్చి పెడుతున్నాయి. ప్యారడైజ్ వద్ద ఉన్న బాలంరాయి రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం జంక్షన్ వరకు రోడ్డును మూసివేయడంతో ఇటీవల ట్రాఫిక్‌ను మళ్లిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్న సంగతి విదితమే. ఫలితంగా తాడ్‌బండ్-ప్యారడైజ్ రోడ్డు ద్వారా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనదారులు కంటోన్మెంట్‌లోని ఇతర ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లను ఆశ్రయిస్తున్నారు. అయితే కంటోన్మెంట్‌లోని పలు ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు చాలా కాలంగా గుంతలమయంగా ఉండడంతో ప్రస్తుతం వాహనదారులు


బాలంరాయి దండుమారమ్మ ఆలయం రోడ్డు

పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. ఒకవైపు ట్రాఫిక్ మళ్లింపుతో చుట్టూ తిరిగి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్న ప్రజలను.. ఈ అధ్వానరోడ్లు మరింత నరకాన్ని చూపుతున్నాయి. ఏ క్షణంలో ఏ గుంతలో పడి ప్రాణాల మీదకు వస్తుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. తాడ్‌బండ్-సిక్ విలేజీ, డైమండ్‌పాయింట్-సిక్‌విలేజీ, డైమండ్‌పాయింట్-కేజేఆర్ గార్డెన్స్, జేబీఎస్-కేజేఆర్ గార్డెన్స్, విమాన్‌నగర్, తిరుమలగిరి, కార్ఖానా, బాలంరాయి, అన్నానగర్ తదితర రోడ్లు గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనాల రాకపోకలను మళ్లించాలని ప్రతిపాదించిన ట్రాఫిక్ అధికారులు ఈ అధ్వాన రోడ్లను సైతం గుర్తించి, వాటికి కాయకల్ప చికిత్స చేయాల్సిందిగా కంటోన్మెంట్ బోర్డు అధికారులకు సూచించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

క్రైస్తవ ప్రత్యేక ప్రార్థనలో తలసాని

పద్మారావునగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మరణం భౌతికంగా వ్యక్తులను దూరం చేసినప్పటికీ, వారి జ్ఞాపకాలు, ప్రేమ మాత్రం ఎల్లప్పటికీ నిలిచి ఉంటుందని మాజీమంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సకల ఆత్మల దినోత్సవం(ఆల్ సోల్స్ డే)సందర్భంగా బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయగూడలోని క్రైస్తవ శ్మశానవాటికలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రార్థనల అనంతరం ఆయనను మత పెద్దలు ఆశీర్వదించారు. ప్రార్థనల నిమిత్తం శ్మశాన వాటికకు వచ్చిన వారికి ఎమ్మెల్యే వ్యక్తిగతంగా బిస్కెట్ ప్యాకెట్లు,జూస్‌లను అందజేశారు. తలసానితో కార్పొరేటర్ కుర్మ హేమలత, పద్మారావునగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, వెంకటేశన్‌రాజు, ఫాదర్ ఆరోగ్యం, గ్రేవ్‌యార్డు కమిటీ సభ్యులు జయరాజ్, జ్యూట్‌పాల్, నాయకులు మహేందర్ గౌడ్, అంబులెన్స్ సురేశ్, కొత్తూరు వెంకట్, సుధాకర్‌రెడ్డి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.


క్రైస్తవ మత పెద్దలతో కలసి కొవ్వొత్తిని వెలిగిస్తున్న తలసాని

శివలింగ ప్రతిష్ఠ పూజలో ఎమ్మెల్యే

కార్తీకమాసం శివునికి ఎంతో ప్రీతిపాత్రమైనదని సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం బోయగూడలోని ఉప్పలమ్మ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన శివలింగ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పూజల అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో వెంకటేశన్ రాజు, ప్రేమ్, కొత్తూరు వెంకటేశ్, నేరెళ్ల రవి, శాంతికుమార్, రంజిత్‌లు పాల్గొన్నారు.

హిరణ్యగర్భ సాలగ్రామానికి ప్రత్యేక పూజలు

మల్కాజిగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా కైశిక ద్వాదశిని పురస్కరించుకుని ఆనంద్‌బాగ్‌లోని హిరణ్య గర్భ సాలగ్రామానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓ భక్తుడు దేవాలయానికి అతిపెద్ద సాలగ్రామను ఇవ్వడంతో ఆ సాలిగ్రామానికి ఆదివారం రోజున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు పలువురు భక్తులు ఆలయానికి చేరుకుని సాలగ్రామ పూజలను తిలకించారు.

● కార్తీక మాసంలో నిర్వహించే తులసి దామోదర కల్యాణోత్సవాన్ని ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తులసి మాత దామోదరులకు ప్రత్యేక కల్యాణోత్సవానికి పలువురు భక్తులు హాజరై తిలకించారు.

● వాణీనగర్‌లోని ఉమా మహేశ్వరులు భక్తులకు రుద్రాక్ష అలంకరణలో దర్శనమిచ్చారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఉమా మహేశ్వరున్ని రుద్రాక్షలతో ప్రత్యేకంగా అలంకరించారు.



శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, రుద్రాక్ష అలంకరణలో ఉమా మహేశ్వరుడు

సగర కులస్థులను బీసీ ఏ కేటగిరిలోకి మార్చాలి

● అఖిలభారత సగర మహాసభ నేతల డిమాండ్

రాంనగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సగర కులస్థులు విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో వెనుకబడిపోయారని, సగరులను బీసీ-ఏ కేటగిరిలోకి మార్చాలని అఖిలభారత సగర మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. అఖిలభారత మహాసభ ఆధ్వర్యంలో సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో దసరా, దీపావళి సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సగర, తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగరలు మాట్లాడారు. సగర హక్కుల సాధనకు సంఘటితంగా ముందడుగు వేస్తున్నామన్నారు. బీసీల 42శాతం రిజర్వేషన్ అమలు కోసం బీసీ ఉద్యమం జరుగుతుందని, రిజర్వేషన్ సాధించడం ద్వారా బీసీలతో పాటు సగరులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మన హక్కుల సాధన కోసం ప్రభుత్వాల మెడలు వంచి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సగర కులస్థుల సంఘటితం కోసం అందరూ పేరు చివరలో సగర అని చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఏపీ నాటి సీఎం ఎన్టీఆర్ బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మారుస్తూ తీసుకువచ్చిన జీవో 165న అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాసభ గౌరవ అధ్యక్షుడు శ్రీరాల శ్రీరాములు సగర, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సగర, నాయకులు వేణుగోపాల్, శ్రీధర్, శ్రవణ్, రాజశేఖర్‌రావు సగర, వినోద్‌కుమార్, సతీష్, సత్యం, కుమారస్వామి పాల్గొన్నారు.

నేడు డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు

ముషీరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కార్యక్రమం లో భాగంగా ఎస్ఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం భోలక్‌పూర్‌లోని అంజుమన్ బాలుర హైస్కూల్‌లో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి శివరాజి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముషీరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు తమ వంతు కృషిచేస్తున్నామని పేర్కొన్నారు.

భవనం పైనుంచి పడి పెయింటర్ మృతి

కవాడిగూడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓ భవనానికి పెయింటింగ్ వేస్తూ నాలుగో అంతస్తు నుంచి కిందపడి ఓ పెయింటర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 5 రత్నరేఖ అపార్ట్‌మెంట్ వద్ద చోటు చేసుకుంది. సీఐ ఎండీ అంజద్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ ఆర్టీసీకాలనీకి చెందిన బానోతు వీరన్న(45) వృత్తి రిత్యా పెయింటర్. రోజు వారి వృత్తిలో భాగంగా ఆదివారం ఉదయం అశోక్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 5 రత్నరేఖ అపార్ట్‌మెంట్‌లో నాలుగో అంతస్తులో పెయింటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద జారిపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. దోమలగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరు మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్

తిరుమలగిరి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫస్ట్ బెన్ని ఫ్రాన్సిస్ క్లాసిక్ 2026 బాడీ బిల్డింగ్ అండ్ ఫిట్‌నెస్ చాంపియన్‌షిప్ ట్రయల్ రన్ పోటీలు బొల్లారంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ ఆధ్వర్యంలో జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన చాంపియన్స్ బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో సెలెక్ట్ అయినవారు మిస్టర్ అండ్ మిస్ సౌత్ ఇండియా 2026కు పాల్గొనడానికి అర్హులు అవుతారని నరసింహన్ తెలిపారు. ట్రయల్ రన్‌లో విజయం సాధించిన చాంపియన్స్‌కు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ట్రోఫీలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవి బాల్‌రాజ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు తదితరులు

మల్లాపూర్‌లో కార్తీక వన సమారాధన

● హాజరైన మంత్రి శ్రీధర్ బాబు

తార్నాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మల్లాపూర్‌లోని వీఎస్ఆర్ గార్డెన్‌లో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బ్రహ్మణ సేవా సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన సువాసిని పూజలో మహిళలతో కలిసి రాష్ట్ర విద్యా, సాంకేతిక శాఖ కమిషనర్ దేవసేన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బ్రహ్మణులు సమాజ సేవలో భాగంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ బ్రహ్మణ సామాజికవర్గం శక్తి సామర్థ్యాలు మరింత పెరగాలని, సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణు గోపాల చారి, తెలంగాణ బ్రహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రాము, గౌరవ అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్ మోహన్ శర్మ, డాక్టర్ శూల ఫణి, కొడకండ్ల రాధాకృష్ణ శర్మ, కోవై దీరజ్ కుమార్ పాల్గొన్నారు.


భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం

మల్కాజిగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని నర్సింహారెడ్డి నగర్‌లో ఏర్పాటు చేయనున్న భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ ఆదివారం ప్రారంభించారు. సుమారు రూ.30 లక్షలతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పనులను సకాలంలో నాణ్యత ప్రమాణాలు పాటించి పూర్తిచేసి ప్రజలకు అందించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల అనంతరం సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీ అధ్యక్షులు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, బాబురావు, జైకృష్ణ, పాండు, కోమలి, శంకర్‌గౌడ్ పలువురు పాల్గొన్నారు.


మెస్‌ను సందర్శిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధికారులు

విద్యార్థి సంక్షేమమే లక్ష్యం

ఓయూ మౌలిక వసతుల సమీక్షలో వీసీ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సంక్షేమం, సదుపాయాల వినియోగమే తమ లక్ష్యమని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం స్పష్టం చేశారు. ఓయూ పరిపాలనా విభాగం ఆదివారం వివిధ సౌకర్యాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులను సమీక్షించింది. సమీక్షలో భాగంగా సీ హాస్టల్, ఎన్ఆర్ఎస్ హాస్టల్, యూనివర్సిటీ హెల్త్ సెంటర్, కొత్త సింథటిక్ ట్రాక్ వంటి ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. హాస్టళ్లలో విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సింథటిక్ ట్రాక్, దుందుభి సదుపాయాల వద్ద మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని వీసీ ఆదేశాలు జారీ చేశారు. వీసీ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ సమీక్షలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, చీఫ్ వార్డెన్ డా.జి.శ్రీనివాస్ రావు, బిల్డింగ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.





శోకతప్త హృదయాలతో ఆల్ సోల్స్ డే

చిలకలగూడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మరణించిన వారి ఆత్మలు శాంతించాలని క్రైస్తవులు ఆదివారం ఆల్ సోల్స్ డే నిర్వహించారు. దేశవ్యాప్తంగా నవంబరు 2వ తేదీని ఆల్‌సోల్స్ డేగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా మెట్టుగూడ, ఆలుగడ్డ బావి క్రైస్తవ శ్మశానవాటిక పిల్లలు, మహిళలు, వృద్ధులతో కిక్కిరిసి పోయింది. మరణించిన వారి సమాధులను పరిశుభ్రం చేసి, పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి వారికి ఇష్టమైన పదార్థాలు ఉంచారు. అనంతరం వారితో గల అనుబంధం, ఆత్మీయతలు గుర్తు చేసుకున్నారు.